తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
29 సెప్టెంబర్ 2026

## ఉల్లి ధరలకు రెక్కలు..

# కొనాలంటేనే జంకుతున్న జనం!

- తెల్ల ఉల్లి రూ.80-90.. • ఎర్ర ఉల్లి రూ.60-70

- వంటింట్లో కన్నీళ్లు తెప్పిస్తున్న ధరలు.. • సామాన్యుల బడ్జెట్‌కు అదనపు భారం • సరఫరా తగ్గడంతో పెరిగిన ధరలు..
- పండుగల వేళ మరింత పెరిగేనా?





**కోహిర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఉల్లి ధరలు క్రమంగా పైపైకి ఎగబాకుతుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల్లో అత్యంత నిత్యావసరమైన ఉల్లి ధర ఒక్కసారిగా పెరగడంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు కిలో కొనుగోలు చేయాలా.. తక్కువ మోతాదుతో సరిపెట్టుకోవాలా.. అంటూ ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కోహిర్ మార్కెట్‌లో తెల్ల ఉల్లి కిలో రూ.80 నుంచి రూ.90 వరకు, ఎర్ర ఉల్లి రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయమవుతోంది.

**సామాన్యుల వంటింటిపై ధరల ప్రభావం...**

ఉల్లి ధర పెరగడంతో కూరగాయల కొనుగోలు బడ్జెట్ మరింత భారమవుతోందని వినియోగదారులు చెబుతున్నారు. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలపై ఈ పెరుగుదల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. కిలోల చొప్పున కొనుగోలు చేసే వారు ప్రస్తుతం అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకునే పరిస్థితి వచ్చిందని పలువురు పేర్కొంటున్నారు.

**దిగుబడి తగ్గిందా.. సరఫరా తగ్గిందా?**

వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో ఉల్లి దిగుబడి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మార్కెట్లకు వచ్చే సరఫరా తగ్గడంతో ధరలు పెరిగినట్లు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో సరుకు లభ్యత తగ్గినప్పుడు డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు వివరిస్తున్నాయి.

**పండుగల వేళ మరింత మంట?**

పండుగల సీజన్ దగ్గరపడుతుండటంతో ఉల్లికి డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో మార్కెట్‌కు సరఫరా ఆశించిన స్థాయిలో లేకపోతే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న చర్చ వినిపిస్తోంది. దీంతో పండుగల ఖర్చులకు తోడు కూరగాయల ధరలు కూడా వినియోగదారుల జేబులకు భారంగా మారుతున్నాయి.

**రైతుకు లాభమా.. వినియోగదారుడికి భారమా?**

ఉల్లి ధర పెరిగితే రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఉల్లి ధరలు ఎప్పుడు తగ్గుతాయో తెలియక కొనుగోలుదారులు అయోమయంలో ఉన్నారు. మార్కెట్‌కు సరఫరా పెరిగి ధరలు నియంత్రణలోకి రావాలని వినియోగదారులు కోరుతున్నారు.

**ధరలపై అధికారుల పర్యవేక్షణ అవసరం...**

ఉల్లి ధరల పెరుగుదలకు సరఫరా లోపమే ప్రధాన కారణమా, లేక మధ్యవర్తుల ప్రభావం కూడా ఉందా అన్నది స్పష్టత రావాల్సి ఉందని వినియోగదారులు అంటున్నారు. మార్కెట్‌లో కొనుగోలు, విక్రయ ధరలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టి ధరల పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

## రూ.11 లక్షల రికవరీ వెనుక

# అధికారుల నిఘా వైఫల్యమా?




**గద్వాల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** గద్వాల మున్సిపాలిటీలో షాపుల అద్దె సొమ్ము దుర్వినియోగం వ్యవహారంలో రూ.11 లక్షలు రికవరీ అయ్యాయి. రికవరీ చేసిన మొత్తాన్ని మున్సిపల్ అధికారిక ఖాతాలో జమ చేసినట్లు కమిషనర్ జానకీరాం సాగర్ తెలిపారు. మున్సిపాలిటీకి చెందిన షాపుల అద్దె వసూళ్లలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రూ.11 లక్షలకు పైగా సొమ్మును దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలిందని అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై గతంలోనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అయితే ఇంత పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం అయ్యే వరకు అధికారులు గుర్తించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల నుంచి పన్నులు, ప్రభుత్వ ఆస్తుల అద్దెల రూపంలో వచ్చే నిధులకు పక్కా లెక్కలు ఉండాల్సి ఉండగా, అద్దె వసూళ్ల రికార్డులు, బ్యాంకు జమలను క్రమం తప్పకుండా ఎందుకు పరిశీలించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజువారీ లేదా వారానికోసారి పర్యవేక్షణ జరిగి ఉంటే నిధుల దుర్వినియోగం ముందుగానే వెలుగులోకి వచ్చేదని పలువురు అంటున్నారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైన తర్వాతే అధికారులు స్పందించడం, పోలీసులకు ఫిర్యాదు చేయడం, రికవరీ చేపట్టడం పర్యవేక్షణ వ్యవస్థపై సందేహాలకు తావిస్తోంది. కేవలం ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై చర్యలతో వ్యవహారాన్ని ముగించకుండా, నిధుల పర్యవేక్షణలో ఎవరి బాధ్యత లోపించిందో నిర్ధారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అద్దె వసూళ్లు, బ్యాంకు జమలపై పారదర్శక డిజిటల్ విధానం, క్రమబద్ధమైన అంతర్గత తనిఖీలు, అధికారుల పర్యవేక్షణను పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రికవరీతోపాటు మున్సిపాలిటీలోని వ్యవస్థాగత లోపాలను గుర్తించి సరిదిద్దాలని, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భూసమస్యల పరిష్కారానికి రీసర్వే ఏకైక మార్గం

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):**
రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూసర్వే ఒక్కటే మార్గమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై సమీక్ష అనంతరం మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

**70 గ్రామాల్లో తొలి దశ సర్వే**

భూ భారతి కింద తొలి దశలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను సర్వేకు ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. నక్షాలు అందుబాటులో లేని రాష్ట్రంలోని మరో 413 రెవెన్యూ గ్రామాల్లోనూ దశలవారీగా సమగ్ర సర్వే చేపడుతున్నామని చెప్పారు. ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్లతో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. భూసర్వేను వేగవంతం చేసేందుకు ఆధునిక రోవర్లను సమకూర్చడంతో పాటు వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసినట్లు తెలిపారు.

**పాత సమస్యలకు శాశ్వత పరిష్కారం...**

సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికార్డుల్లో లోపాలు, అబాది ఆస్తుల సమస్యలకు సమగ్ర సర్వేతో పరిష్కారం చూపవచ్చన్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాల విస్తీర్ణం, హద్దులను మ్యాపింగ్ చేసి రికార్డుల్లో నమోదు చేస్తామని చెప్పారు. దశాబ్దాలుగా సాగులో ఉన్నప్పటికీ సరైన టైటిల్ లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాల సమస్యలను నిబంధనల మేరకు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు



తెలిపారు. సర్వేయర్లు రాజకీయ ప్రచారాలను పట్టించుకోకుండా రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగించేలా పనిచేయాలని కోరారు.

**ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయాలకు తావులేదు**

పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి అన్నారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడతలో అసంపూర్తిగా నిలిచిన పేదల ఇళ్లకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

మిగతా 10లో..

# వనపర్తి ఆర్ అండ్ బీ సర్కిల్ ఆఫీసులో కుప్పకూలిన పైకప్పు

- ప్రాణాల అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్న అధికారులు

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):**
వనపర్తి జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) సర్కిల్ కార్యాలయంలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం 11 గంటలకు కార్యాలయంలోని ఒక ముఖ్యమైన గదికి సంబంధించిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (ఫ్రూరా) పైకప్పు (సీలింగ్) ఒక్కసారిగా కుప్పకూలింది. భారీ శబ్దంతో సీలింగ్ ముక్కలు, ఇనుప ఫ్రేములు కిందపడటంతో ఆ ప్రాంతమంతా శిథిలమయమైంది. ప్రమాదం జరిగిన సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ముప్పు తప్పిందని, అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. పైకప్పు ఊడిపడిన తీరును చూస్తే, ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం లోపల ఉన్న ఇతర గదుల పైకప్పులు కూడా ఎప్పుడు ఊడిపడతాయో తెలియని దుస్థితి నెలకొంది.

ఈ ప్రమాదంపై స్థానిక ఉద్యోగ సంఘాలు, అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భవనం ప్రమాదకరంగా మారినప్పటికీ అధికారులు, సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఈ భవనానికి మరమ్మతులు చేపట్టాలని లేదా ప్రత్యామ్నాయంగా సురక్షితమైన చోటికి కార్యాలయాన్ని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడలకు పెద్దపీట

**జిన్నారం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించి క్రీడాజ్యోతి వెలిగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యంతో పాటు ఉన్నత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని



తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని, పటాన్‌చెరు మైత్రి మైదానాన్ని రూ.7 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. వివిధ మండలాల్లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో మినీ స్టేడియాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.



వివిధ క్రీడల్లో ప్రతిభ చూపుతున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్దన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కమిషనర్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు వెంకటేష్ గౌడ్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనం

**కోహీర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కోహీర్ మండలవ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రాత్రి నిర్వహించిన నిమజ్జన కార్యక్రమాలతో ప్రశాంతంగా ముగిశాయి. భక్తులు డప్పులు, భజనలు, నృత్యాలతో శోభాయాత్రలు నిర్వహించి గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జనాన్ని పురస్కరించుకుని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, మండపాలు, నిమజ్జన మార్గాల్లో నిరంతరం పర్యవేక్షించారు. ఎస్సై నరేష్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వినాయక కమిటీ నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ రద్దీ, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. పోలీసుల ముందస్తు చర్యలు, కమిటీల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం సజావుగా పూర్తయింది.

## ప్రజల సమస్యలకు ప్రజావాణి వేదిక

**కోహీర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కోహీర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన 17 మంది అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలు, వినతులను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 10 దరఖాస్తులు, పిటిషన్లు స్వీకరించిన అధికారులు వాటిని సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. నిబంధనల మేరకు దరఖాస్తులను పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు



సూచించారు.ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతోంది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో అందిన వినతులను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఓట్ల గల్లంతుపై కాంగ్రెస్ నిరసన

**సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై నిరసనగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు.





డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తారు. నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలపై కాంగ్రెస్ గత కొంతకాలంగా ప్రశ్నలు లేవనెత్తు తోందన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లా డుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించి పత్రాలు సమర్పించినప్పటికీ నియోజకవర్గంలో పలువురికి నోటీసులు వచ్చాయని తెలిపారు. దళితులు, మైనార్టీల ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారన్నది తమ ఆరోపణ అని పేర్కొన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామని అన్నారు. ఎన్నికల కమిషన్‌లోని ఇతర సభ్యులకు తెలియకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ బిహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపిస్తోందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంగీతకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నీల మధు, కాటా సుధారాణి, తోపాజి అనంతకిషన్, రామ్‌రెడ్డి, కూడ వనిత సంతోష్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు. **గమనిక:** జ్ఞానేశ్ కుమార్ ప్రస్తుతం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారిక వివరాలు ధృవీకరిస్తున్నాయి.

## మత్తుకు దూరంగా.. ఆరోగ్యానికి దగ్గరగా!

**కోహీర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** దిగ్వాల్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు, ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితంపై ప్రభావాలను వైద్య సిబ్బంది విద్యార్థులకు



వివరించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వైపు ప్రోత్సహిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, వ్యాయామం, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ జకీర్ హుస్సేన్, వైద్యాధికారి డాక్టర్ బి.నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభం

**రామాయంపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కాట్రియాల్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో సోమవారం సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని సర్పంచ్ కొత్త స్రవంతి ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం అందించారు.



రెండు పాఠశాలల్లో 155 మంది విద్యార్థులు ఉండగా తొలిరోజు 130 మందికి అల్పాహారం అందించారు. పోషకాహారంతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడి చదువుపై ఆసక్తి పెరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనంతరం ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న 61 మంది విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబు, హెచ్ఎంలు గాలయ్య, కవిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీజేడబ్ల్యూఎఫ్ అధ్యక్షుడిగా పుట్టి సంజీవ్ కుమార్

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీజేడబ్ల్యూఎఫ్) నారాయణఖేడ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుట్టి సంజీవ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీరదర్ ప్రతాప్, జనరల్ సెక్రటరీగా కైసర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కోశాధికారి, పీఆర్వో, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర, జిల్లా నాయకులు, జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## మండలాధ్యక్షుడిగా ఖలీమ్ నియామకం



**పాపన్నపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** పాపన్నపేట మైనార్టీ మండలాధ్యక్షుడిగా పాపన్నపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.ఖలీమ్ మియాను నియమించారు. సోమవారం మెదక్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మైనార్టీ జిల్లా చైర్మన్ సూఫీ జానీ నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈసందర్భంగా ఖలీమ్ మాట్లాడారు. హస్తం పార్టీ అభివృద్ధికి కార్యకర్తలతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంత రావు,మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా భగత్ సింగ్ జయంతి

**టేక్మాల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన అమర వీరుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను జిల్లా లేబర్ సెల్ కన్వీనర్



నాయికోటి శామయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను, పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిరాములు, సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కన్వీనర్ ఎల్లుపేట రాజు, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు కోయిలకొండ దుర్గాప్రసాద్, నాయకులు మదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యార్థికి గాయాలు

**హత్నూర, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** దౌల్తాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యార్థి గాయపడింది. నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్‌కు చెందిన కుసంగి సంజన దౌల్తాబాద్



సాయి రిషి కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతోంది. ఇంటికి వెళ్లేందుకు నర్సాపూర్ డిపో బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ ప్రయాణికులను గమనించకుండా బస్సు ముందుకు నడపడంతో ఆమె కాలిపై నుంచి చక్రాలు వెళ్లి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి కుటుంబసభ్యులు డ్రైవర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ఆధునిక సర్జరీ నైపుణ్యాలతో థొరాసిక్ శస్త్రచికిత్సలు




సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): ఛాతీ సంబంధిత వ్యాధులకు ఆధునిక వైద్య సాంకేతికతతో మినిమల్లీ ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చా యని యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి. రోహన్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని రెడ్డీస్‌లో సోమ వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఛాతీ వ్యాధులు, ఆధునిక శస్త్రచికిత్సా విధానాలపై వివరించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహికలో కణితులు, ఛాతీ మధ్య భాగంలోని వ్యాధులు, దయాఫ్రం సంబంధిత సమస్యలకు ఆధునిక పద్ధతుల్లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. వీడియో కెమెరా సహాయంతో నిర్వహించే వీటీఎస్ (వీఏటీఎస్), రోబోటిక్ సర్జరీ విధానాలతో చిన్న కోతల ద్వారా శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు. దీంతో నొప్పి తక్కువగా ఉండటంతో పాటు ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గి, రోగులు త్వరగా సాధారణ జీవనానికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. చాలా ఛాతీ వ్యాధులను తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. థొరాసిక్ సర్జన్లు, పల్మనాలజిస్టులు, ఆంకాల జిస్టులు, రేడియాలజిస్టులు, అనస్థీషియాల జిస్టులు, క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన బహుళ విభాగాల వైద్య బృందం సమన్వయం తో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి సేవలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అధునాతన క్రిటికల్ కేర్, ట్రాన్స్‌ప్లాంట్ అనంతర రిహాబిలిటేషన్ సేవలతో రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని డాక్టర్ రోహన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో యశోద హాస్పిటల్స్ జనరల్ మేనేజర్ కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

మంజీరాను అర్థం

# చేసుకోవడమే పరిరక్షణకు తొలి అడుగు





పుల్కల్, సెప్టెంబరు 27(జనంసాక్షి): ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఆధ్వర్యం లో విద్యార్థులు, అధ్యాపకులు,నదీ పరిరక్షణ ఆసక్తిపరులు ఆదివారం సింగూరు ప్రాజెక్టు ను సందర్శించారు. ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ నది కేవలం నీటి ప్రవాహం కాదని,తాగునీరు, సాగు, భూగర్భ జలాలు, ప్రకృతి, చరిత్రతో ముడిపడి ఉందన్నారు. మంజీరా నదిని అర్థం చేసుకోవడమే దాని పరిరక్షణకు తొలి అడుగని పేర్కొన్నారు. సింగూరు ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈఈ మధుసూదన్ ప్రాజెక్టు నిర్మాణం,నీటి నిల్వ సామర్థ్యం, హైదరాబాద్ తాగునీటి సరఫరా, సాగునీటి విడుదల, విద్యుత్ ఉత్పత్తి వివ రాలను తెలిపారు. అనంతరం సందర్శకులు ప్రాజెక్టుతోపాటు రాష్ట్ర పురావస్తుశాఖ ఆధ్వ ర్యంలోని ఓపెన్ మ్యూజియంలోని వీర గల్లులు, శిల్పాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు, అధ్యాప కులు, విద్యార్థులు,దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ లడ్డుకు రికార్డు ధర



అమీన్‌పూర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): బీరంగూడ డివిజన్ పరిధిలో ఎన్ ఎస్ జి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ లడ్డూ రికార్డు ధర పలికింది. ఆదివారం రాత్రి నిర్వహించిన లడ్డు వేలం పాటలో ఆందోల్ నియోజకవర్గం నేరేడు గుంట గ్రామ సర్పంచ్ సాయి కిరణ్ రూ.26,01116 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నాడు. గత ఏడాది కూడా సాయికిరణ్ లడ్డూను రూ.25 లక్షలకు దక్కించుకున్నాడు. గత ఏడాది లడ్డు తీసుకోవడంతో తనకు అన్ని విధాలుగా కలిసి వచ్చింది అని ఈ ఏడాది పోటీగా వేలం పాట పాడి లడ్డు దక్కించుకున్నాడు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి



పుల్కల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠ శాలలో మౌలిక వసతులు కల్పించా లని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఎంఈఓ శంకర్‌కు వినతిపత్రం అంద జేశారు. వర్షం పడితే పాఠశాలలోకి నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. బీట లు వారిన గోడతో ప్రమాదం పొంచి ఉందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించి, అవసర మైన మరమ్మతులు చేపట్టాలని కోరారు.

# క్రీడలు ఆరోగ్యానికి ఎంతో అవసరం



కోహెడ, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, ఎస్‌జీఎఫ్ జిల్లా కన్వీనర్ కలకొండ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యం, మానసిక ఉత్సాహాన్ని పెంచుతాయన్నారు. క్రీడలతో ఐకమత్యం, నాయకత్వం, క్రమశిక్షణ అలవడతాయని తెలిపారు. సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అధికారులు, పీడీలు, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి

# తుమ్మలపల్లి సంతోష్‌కు సన్మానం



చేర్యాల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): చేర్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ఎన్నికైన తుమ్మలపల్లి సంతోష్‌ను పట్టణంలోని ఆదివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

రాయితీపై

# శనగ విత్తనాలను పంపిణీ చేయండి



న్యాల్ కల్, సెప్టెంబర్ 28, (జనంసాక్షి): మరో వారం రోజుల్లో రబీ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన శనగ విత్తనాలను పంపిణీ చేయాలని కోరుతూ.. మండలంలోని చీకూర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, న్యాల్ కల్ సహకార సంఘం డైరెక్టర్ జనార్దన్ రెడ్డి సోమవారం ప్రజావాణికి విన్నవిం చారు. మంజీరా పరివాహక ప్రాంతం గ్రామాల శివారుల్లో ఇటీవల అడపా దడపగా కురిసిన మోస్తారు వర్షాలతో.. పంటను సాగు చేసేందుకు వాతావరణం అనుకూలంగా ఉన్న నేపథ్యంలో సంబంధిత వ్యవసాయ అధికారులు వెంటనే రాయితీపై శనగ విత్తనాలను పంపి ణీ చేయాలని ఎంపీడీవో నరేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కొల్చారం, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్లో సోమవారం కొల్చారం మండల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అంద జేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు చేసిన ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందించినందుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, నాయకులు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కల్లేపల్లిలో ఘనంగా పోషకాహార మహోత్సవం



బెజ్జంకి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): మండలంలోని కల్లేపల్లి అంగన్వాడీ కేంద్రం లో సోమవారం పోషకాహార మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నప్రాసన, శ్రీమంతం నిర్వహించి బేబీ కిట్లు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారు లకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగ రాణి మాట్లాడుతూ చిరుతిళ్లకు బదులు ఆకుకూరలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, రాగులు, జొన్నలు వంటి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భి ణులు గుడ్లు, పాలు, పప్పుధాన్యాలు తీసు కోవాలని తెలిపారు. అనంతరం చిన్నారుల కు బరువు, ఎత్తు పరీక్షలు నిర్వహించి గుడ్లు, పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ బిగుల్ల మోహన్, ఉపసర్పంచ్ వినీత్ గౌడ్, ఉపా ధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు సాగు చేయాలి





తూప్రాన్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి సూచించారు. తూప్రాన్ రైతు వేదికలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎకరం వరికి అవసరమయ్యే నీటితో రెండు, మూడు ఎకరాల ఆరుతడి పంటలు పండించవచ్చన్నారు. మండల వ్యవ సాయ అధికారి పి. గంగామల్లు మాట్లా డుతూ యాసంగిలో వరికి బదులుగా నూనె గింజలు, పప్పుదినుసులు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం, జీవ ఎరువుల ప్రయోజనాలను వివరించారు. కోరమాండల్ ప్రతినిధులు నానో యూరి యా, నానో డీఏపీ, సేంద్రియ ఎరువుల లభ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఏఈఓ అభిలాష్‌గౌడ్, ఏటీఎం సింధు, డీసీఎస్, సీసీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కోసం కాంగ్రెస్ నిరసన



కోహీర్, సెప్టెంబరు 28 (జనంసాక్షి): ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కోహీర్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఓట్ల చోరీపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలను ప్రశ్నిస్తూ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టీ. సువర్ణ మల్లన్న పాటిల్, పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం

**కౌడిపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. సోమవారం కౌడిపల్లి మండలం ముత్రాజ్‌పల్లిలో ఉద్యాన పంటల క్షేత్రాలను ఆమె పరిశీలించారు.

గ్రామానికి చెందిన రైతు కె. రవీందర్ 20 గుంటల్లో ఏర్పాటు చేసిన పాలీహౌస్‌లో సాగు చేస్తున్న యూరోపియన్ కీర దోసకాయ పంటను కలెక్టర్ పరిశీలించారు. సాగు ఖర్చు, దిగుబడి, మార్కెటింగ్, ఆదాయ వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. 2,000 చదరపు మీటర్ల పాలీహౌస్‌లో 90 రోజుల్లో 25 నుంచి 30 టన్నుల దిగుబడి వస్తుందని, పంట ద్వారా రూ.7-8 లక్షల వరకు నికర లాభం



పొందుతున్నట్లు రైతు తెలిపారు. రైతును అభినందించిన కలెక్టర్ ఆధునిక సాగు విధానాలను యువ రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

అనంతరం ఎన్‌ఎంఈఓ-ఓపీ పథకం కింద సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. పరాగ సంపర్కం కోసం ఎలిడోబియస్ కామెరూనికస్ పురుగులను స్వయంగా విడుదల చేశారు. వీటి ద్వారా పరాగ సంపర్కం మెరుగై గెల బరువు, దిగుబడి పెరుగుతుందని అధికారులు వివరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ సూచించారు.

ఎంఐడీహెచ్ పథకం కింద నిర్మించిన ఫామ్‌పాండ్‌ను కూడా ఆమె పరిశీలించారు. వేసవిలో ఉద్యాన పంటలకు రక్షక తడులు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, ఉద్యాన విస్తరణ అధికారులు, ఆయిల్‌పామ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బెజ్జంకిలో నిండిన డ్రైనేజీలు.. దుర్వాసనతో ప్రజల అవస్థలు

- డ్రైనేజీలు క్లీన్ చేసి సమస్య పరిష్కరించాలి
- సీపీఎం గ్రామ కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణ



**బెజ్జంకి,సెప్టెంబర్ 28,(జనంసాక్షి):** మండల కేంద్రంలోని డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేసి,మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణ డిమాండ్ చేశారు.సోమవారం బెజ్జంకి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో గ్రామంలోని డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ బెజ్జంకి గ్రామంలోని బస్టాండ్ నుంచి కాలేజీ రోడ్డు వరకు ఉన్న డ్రైనేజీలు పూర్తిగా నిండిపోయి మురుగు నీరు నిల్వ ఉంటోందన్నారు.దీంతో తీవ్ర దుర్వాసన వస్తుండటంతో పాటు దోమలు,ఈగలు విపరీతంగా పెరిగి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు.డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేసి,మురుగు నీరు నిల్వ లేకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘ ఎల్లయ్య పాల్గొన్నారు.

## కల్హేర్‌లో ఫామ్‌పాండ్ పనులను తనిఖీ చేసిన ఏపీఓ గురుపాదం

**కల్హేర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కల్హేర్ మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు కల్హేర్ గ్రామ శివారులో రైతు సాయిలు పొలంలో వివిజి రాంజీ (కలహస్తి రాంజీ) ద్వారా నిర్వహిస్తున్న ఫామ్ పాండ్ పనులను ఎంపీడీవో కార్యాలయ ఏపీఓ గురుపాదం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఫామ్ పాండ్ తవ్వకం పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కూలీల మస్టర్ హాజరు, మట్టి పనుల కొలతలు, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పనులు



చేపట్టాలని సూచించారు.

ఫామ్ పాండ్‌ల వల్ల భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, కావున నిర్దేశించిన గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కూలీలకు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి పనిని పక్కాగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు నూతన మూత్రశాలల మంజూరు



**మఖ్తల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** మఖ్తల్ మున్సిపాలిటీ 16వ వార్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.30 లక్షలతో నూతన మూత్రశాలలు నిర్మించేందుకు అనుమతులు లభించాయని కౌన్సిలర్ అల్లురి పావని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో మంత్రి వాకిటి శ్రీహరి భూమిపూజ చేస్తారని చెప్పారు. సోమవారం కమిషనర్ రాజయ్య, ఏఈ నాగశివ స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థుల అధిక సంఖ్య, మూత్రశాలల కొరత సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేశారని కౌన్సిలర్ తెలిపారు. మంత్రి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ర్యాలీకి నారాయణఖేడ్ యూత్ కాంగ్రెస్ శ్రేణులు



**నాగల్గిద్ద, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంగారెడ్డిలో నిర్వహించనున్న నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు నారాయణఖేడ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాలిపటేల్ శివకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీకి బయలుదేరారు. ఓటర్ల జాబితాలో ఓట్ల గల్లంతుపై నిరసనగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాణిక్ రావ్ పాటిల్, సంగమేశ్వర్ పాటిల్, సంతోష్ పాటిల్, అనిల్ కుమార్, దత్తురెడ్డి, ఖలీద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు



**కోహిర్, (జనంసాక్షి):** పద్మభూషణ్ గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలను ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. అనంతరం అబ్రహం మాదిగ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో జాషువా చిరస్థాయిగా నిలిచిన మహాకవి అన్నారు. తన రచనల ద్వారా సామాజిక రుగ్మతలు, కుల వివక్షపై పోరాడారని కొనియాడారు. జాషువా ఆశించిన సమసమాజం కోసం ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్మల్‌కుమార్ మాదిగ, దయానంద్ మాదిగ, జైరాజ్ మాదిగ, పద్మారావు మాదిగ, సుకుమార్, కిట్టు, మనోజ్, రజిని తదితరులు పాల్గొన్నారు.

## డీజేల నిర్వహణపై కేసు నమోదు

**అమీన్పూర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వినాయక నిమజ్జనంలో నిబంధనలకు విరుద్ధంగా డీ జే లు నిర్వహించడంపై అమీన్పూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం బీరంగూడలో ఆదివారం రాత్రి నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవం లో నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా డీ జే లు నిర్వహించి రహదారి మూసివేసి అధిక శబ్దాలు వచ్చేలా చేశారు. దాంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మూడు డీజే వాహనాలను, డీజే ఆపరేటర్లను అదుపులోకి తీసుకున్నారు. అనుమతులు లేకుండా నిబంధనలు పాటించకుండా డీజిల్ నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వెల్దుర్తి-మెదక్ రహదారికి తాత్కాలిక మరమ్మతులు



**వెల్దుర్తి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వెల్దుర్తి-మెదక్ రహదారి శిథిలావస్థకు చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. గతంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వెల్దుర్తి-శెట్టిపల్లి మధ్య 12 కిలోమీటర్లు పాదయాత్ర చేసి, రోడ్డు మరమ్మతులకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. అడుగులోతు గుంతలతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సూచనల మేరకు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వంచ భూపాల్‌రెడ్డి, మాజీ మార్కెటింగ్ వైస్‌చైర్మన్ కోదండ కృష్ణగౌడ్, మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. వెల్దుర్తి--మెదక్ డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## జిల్లా కిసాన్ మోర్చా సమన్వయకర్తగా శరణయ్య స్వామి



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా సమన్వయకర్తగా మామిడిగి గ్రామానికి చెందిన శరణయ్య స్వామి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, వ్యవసాయ పరికరాలు అందేలా కృషి చేస్తానని శరణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీబీ పాటిల్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొని శరణయ్యను సన్మానించారు.

## భగత్ సింగ్ కు యువత ఘననివాళి

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** స్వాతంత్ర సమరయోధుడు, యువతకు స్ఫూర్తి ప్రధాతైన భగత్ సింగ్ నకు యువత ఘనంగా నివాళులర్పించారు. సోమవారం



భగత్ సింగ్ 100వ జయంతి సందర్భంగా.. న్యాల్ కల్ లోని హనుమాన్ మందిర్ నారాయణఖేడ్ రోడ్ ప్రధాన కూడలి వద్దన గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్రం కోసం చేసిన సేవలను స్మరిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో యువకులు విష్ణు, అంజి, బన్నీ, రామ్ రెడ్డి, నవీన్, ప్రవీణ్ లు పాల్గొన్నారు.

## పోషణ మాసం కార్యక్రమం

**వెల్దుర్తి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** మంగళపర్తి అంగన్వాడి కేంద్రంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సంధ్యారామకృష్ణారావు,



టీచర్ సుమలత ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, మొలకలు, పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలు వాడాలని, వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. అన్నప్రాసన, శ్రీమంతం కార్యక్రమాలు నిర్వహించారు.

# జిన్నారంలో రూ.1.80 కోట్లతో 33 దుకాణాల నిర్మాణం



**జిన్నారం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** జిన్నారం మున్సిపల్ కేంద్రంలో రూ.1.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33 దుకాణాల సముదాయాల పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన దుకాణాల ద్వారా మున్సిపాలిటీకి ప్రతి నెల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రూ.15 కోట్లతో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని అన్నారు. జిన్నారం మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కమిషనర్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# జలసిరి పనులను వేగవంతం చేయాలి

- క్షేత్రస్థాయిలో ఫామ్ పాండ్లను పరిశీలన
- అదనపు డీఆర్డీఓ బాలరాజ్





**సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** జలసిరి పనుల్లో భాగంగా అదనపు డీఆర్డీఓ బాలరాజ్ సోమవారం శివంపేట, చౌటకూర్ మండల పరిధిలోని పోసానిపల్లి, బొమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో పర్యటించి ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలసిరి పథకం కింద ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, గ్రామాల్లో మురుగునీటి కాలువలు, నీటి పారుదల మార్గాలను నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించేలా పనులు చేపట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మధులత, ఎంపీడీఓ కే. శంకర్, చౌటకూర్ సర్పంచ్ రామ్‌రెడ్డి, పోసానిపల్లి సర్పంచ్ రేణుక బాలరాజు, బొమ్మారెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్ నాయక్, ఏపీఓ రామ్మోహన్, ఈసీ మహేశ్వర్‌రెడ్డి, టీఏ రమేష్, ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్, సందీప్, అశోక్, ఉప సర్పంచులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు వనపర్తి క్రీడాకారులు

## రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందన



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కరీంనగర్‌లో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో వనపర్తి జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. వారి ప్రతిభ ఆధారంగా అక్టోబర్ 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం తన స్వగృహంలో సన్మానించి అభినందించారు. జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు, వారికి అవసరమైన సహకారం అందించేందుకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, బాలిశ్వర్‌రెడ్డి, వెంకట్‌సాగర్, శంకరయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జోహేబ్ హుస్సేన్, గౌడ నాయక్, మహేష్, మందా రాము, తోట శీను తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- కలెక్టరేట్ ఏవోకు కాంగ్రెస్ వినతిపత్రం



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఎన్నికల సంఘం పనితీరు,ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమ వుతున్న నేపథ్యంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఏఓకు వినతిపత్రం అందజేశారు.

ఇటీవల కొన్ని జాతీయ పత్రికలలో పరిశోధనాత్మక కథనం ప్రకారం,ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు,వివేక్ జోషిలు గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల జాబితా,కొత్త ఓటర్ల నమోదు,ఓటర్ల పేర్ల తొలగింపు మరియు పునరుద్ధరణ,ఎన్నికల డేటా నిర్వహణ తదితర అంశాలపై అభ్యంతరాలను రికార్డులో నమోదు చేసినట్లు వెల్లడైందన్నారు.

ఇంత భారీ స్థాయిలో జరిగే ఓటర్ల జాబితా సవరణలో ప్రతి అర్హుడైన ఓటరుకు తగిన నోటీసు, తన వాదనను వినిపించే అవకాశం, పేరును సరిచేసుకునే సమర్థవంతమైన ప్రక్రియ ఉండాలని ఆయన కోరారు.ఎన్నికల సంఘం లోని ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారనే నివేదికలు వెలువడిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తి పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందచేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్. సలీం, అధికార ప్రతినిధి వి.సంతోష్ కుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎండి.గౌస్,శ్రీనివాస్ రెడ్డి, విజయ్ గౌడ్,కృషా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 4న అమిత్ షా రాక





**తూప్రాన్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వచ్చేనెల నాలుగో తేదీన మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో ఓ పరిశ్రమ శంకుస్థాపనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రానున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. బ్రాహ్మణపల్లి శివారులో గల స్థల పరిశీలన చేసిన అనంతరం మాట్లాడారు. బ్రాహ్మణపల్లి రైల్వే లైన్ ప్రక్కన ఖాళీ స్థలంలో సుమారు 14 ఎకరాలు విస్తీర్ణంలో పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు అందుకు అమీషా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో అక్టోబర్ 4 న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనలో భాగంగ తూప్రాన్ మున్సిపాలిటీ వార్డ్ 10 బ్రాహ్మణపల్లి శివారు ప్రాంతంలో సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వర్గంటి రామ్మోహన్ గౌడ్ , సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ,బిజెపి తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షుడు భూమన్న గారి జానకిరామ్ గౌడ్,స్టేట్ కౌన్సిల్ సభ్యులు యాదగిరి , సిద్దిపేట జిల్లా మీడియా కన్వీనర్ శశిధర్ రెడ్డి ,తూప్రాన్ మండల అధ్యక్షుడు పిట్ల పోచయ్య కౌన్సిలర్లు బొల్లం సత్యనారాయణ ,చందా అశోక్, మన్న స్వామి, మనోహరాబాద్ , శివంపేట్ ,వెల్దుర్తి , మాసాయిపేట్ మండల అధ్యక్షులు తూప్రాన్ మున్సిపల్ సీనియర్ నాయకులు, బూత్‌అధ్యక్షులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి





**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** సంగారెడ్డి చౌరస్తా నుంచి మదీనగూడ వరకు జాతీయ రహదారి-65పై చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి జాప్యాన్ని నివారించాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు పనుల వల్ల ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ సమయంలో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. పరిశీలనలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, ట్రాఫిక్, రూరల్ పోలీస్ అధికారులు, ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆదుకోవాలి

- తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్



**జడ్చర్ల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో జరగనున్న ఢిల్లీ ఆక్యుపై ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో కె.కృష్ణ అధ్యక్షతన మున్సిపల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా రాబోయే పే కమిషన్ లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు 30 వేల కనీస వేతనం ఇవ్వాలని, కేంద్రం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ అధ్యక్షురాలు ఇందిరమ్మ మాట్లాడుతూ, 2012 నుండి పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్ నిధులను కార్మికులు, మృతి చెందిన వారి కుటుంబాల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్మికులకు సబ్బులు, నూనెలు, డ్రెస్సులు వెంటనే ఇవ్వాలని, డిసెంబర్ 9న జరిగే సదస్సుకు కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అంజమ్మ, స్వరూప, దేవమ్మ, విద్యాసాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన టీఆర్‌వీకే కోఆర్డినేటర్



**మల్దకల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** టీఆర్‌వీకే గద్వాల కోఆర్డినేటర్ డా.పి.అర్చన ఆధ్వర్యంలో సోమవారం మల్దకల్ మండలంలో పత్తి, వరి, బెండ, టమాటా పంటలను పరిశీలించారు. రైతులతో పంటల పరిస్థితిపై చర్చించారు. పత్తిలో గులాబీ రంగు పురుగు లక్షణాలను గుర్తించి, ఫెరోమోన్ ట్రాప్స్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. వరి పంటలో ఆకులు, కాండం ఎర్రబడినట్లు గుర్తించారు. బెండలో సక్కింగ్ పెస్ట్స్, కాయ, కొమ్మ తొలిచే పురుగులను క్రమం తప్పకుండా గమనించాలని తెలిపారు. ఆర్థిక నష్ట పరిమితి దాటినప్పుడే సిఫారసు చేసిన మోతాదులో పురుగుమందులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఏఈఓ రాహుల్ పైలట్ పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించి, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 65 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 12, నారాయణఖేడ్ డివిజన్‌కు 05, జహీరాబాద్ డివిజన్‌కు 05,అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని, కలెక్టరేట్‌కు 43 దరఖాస్తులు అందాయని, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్,పెన్షన్లు, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్ ,మిషన్ భగీరథ గ్రిడ్, పోలీస్,సోషల్ వెల్ఫేర్ ,సర్వే & ల్యాండ్ రికార్డ్స్, మహిళా, శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పిసిబి, ఎల్‌డిఎం, వైద్య ఆరోగ్య శాఖ, మునిసిపల్ శాఖలకు సంబందించిన పిర్యాదులు అందాయి . ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## కృష్ణాపూర్ విద్యార్థినులకు ఘనత.. రాష్ట్రస్థాయికి ఎంపిక



కల్హేర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): తూప్రాన్‌లోని టీజీఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన 59వ సీనియర్ ఖో-ఖో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో కల్హేర్ మండలం కృష్ణాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పదో తరగతి విద్యార్థినులు సి.హెచ్. హరిత, డి. ముస్కాన్ అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ రెండో వారంలో నల్లగొండ జిల్లా ఆలియాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరఫున వారు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు అభినందించారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ రాములు కృషిని కొనియాడారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


## షూస్ ఎందుకు వేసుకుని రావడం లేదు?: ఎంఈఓ



కల్హేర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): కల్హేర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఉదయం మండల విద్యాధికారి బి. సురేష్ సందర్శించారు. ప్రార్థన సమయంలో విద్యార్థులు యూనిఫాంలో ఉన్నప్పటికీ షూస్, బెల్ట్ ధరించకపోవడాన్ని గమనించారు. ప్రభుత్వం సుమారు రూ.70 వేలతో షూస్ అందించినందున తప్పనిసరిగా వాటిని ధరించి రావాలని సూచించారు. గురువారం నుంచి ఎస్ఏ--1 పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు బాగా సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం భౌతికశాస్త్ర కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించారు. 'ఏ బుక్ ఆఫ్ డిజిటల్ లెర్నింగ్'లో కల్హేర్ మండలం వెనుకబడి ఉందని, ఉపాధ్యాయులు పోర్టల్‌లో రిజిస్టర్ చేసి విద్యార్థులందరూ యాక్టివ్‌గా ఉండేలా చూడాలని ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సంజీవ్‌కుమార్ సూచించారు.

## డ్రైనేజీ సమస్యతో పుల్కల్ ప్రజల అవస్థలు

- మురుగునీరు నిలిచిపోవడంతో దోమల బెడద.. ఇబ్బందుల్లో స్థానికులు
- సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీడీవోకు వినతి






పుల్కల్, సెప్టెంబర్ 28( జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన పుల్కల్ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో మురుగునీరు సక్రమంగా వెళ్లే మార్గం లేక ఇళ్ల సమీపంలోనే నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని సోమవారం గ్రామస్తులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మురుగునీరు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్నిచోట్ల మురుగునీరు రోడ్లపైకి చేరుతుండటంతో రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతోందన్నారు. నిత్యం ప్రజలు తిరిగే ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న డ్రైనేజీ కాలువలను పూర్తిస్థాయిలో పరిశీలించి, పూడిక తొలగించడంతో పాటు అవసరమైన చోట కొత్త కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా ప్రధాన కాలువలకు అనుసంధానం చేసి, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## చెన్నారంలో అక్రమ ఇసుక రవాణా - ట్రాక్టర్ పట్టివేత



రేవల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): చెన్నారం గ్రామానికి చెందిన బంకల రాముడు నిన్న రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా చీర్కపల్లి నుండి చెన్నారం గ్రామానికి ఇసుక లోడుతో వస్తుండగా చెన్నారం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది పట్టుకున్నారు. ట్రాక్టర్ నెంబర్ టీఎస్ 32 ఎఫ్ 3057 నెంబర్ గల ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ఘటనపై ఎస్సై రజిత కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## అక్కన్నపేటలో రైల్వే బ్రిడ్జిల మధ్య అండర్‌పాస్ కోసం కలెక్టర్‌కు వినతి పత్రం

- 601,602 బ్రిడ్జిల మధ్య అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



రామాయంపేట, సెప్టెంబర్ 28(జనంసాక్షి): మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నూతనంగా అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి & రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. అక్కన్నపేట నుంచి మెదక్ వైపు నూతన రైల్వే లైన్ నిర్మాణంతో వ్యవసాయ భూములకు వెళ్లే దారి లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ వాహనాలను వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం సరైన రాకపోకల మార్గం లేకపోవడంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే బ్రిడ్జి నంబర్లు 601, 602 మధ్య అండర్‌పాస్ నిర్మిస్తే రైతులకు రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని వివరించారు. గతంలో రైల్వే అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని రైతులు తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 601, 602 బ్రిడ్జిల మధ్య అండర్‌పాస్ మంజూరు చేసి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పేటలో నషా ముక్త్ యువ-వికసిత్ భారత్ ర్యాలీ



నారాయణపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): నషా పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నారాయణపేటలో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప ర్యాలీని ప్రారంభించారు. ఆర్డీఓ కార్యాలయం నుంచి పాత ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగింది. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్యంపై అవగాహన అవసరం



సిద్దిపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): బాలికలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లలిత భవాని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్లు భావన, కిరణ్మయి దంత సమస్యలు, కడుపునొప్పి, నెలసరి క్రమబద్ధతలో మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సుమారు 400-500 మంది బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు




మక్తల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): మక్తల్ పట్టణంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గవర్నర్ కలిమిచెర్ల రమేష్ పర్యటనలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించి, వారి ఆరోగ్య భద్రత కోసం గ్లౌజులు, మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మానస హన్మంతు, కమిషనర్ రాజయ్య, వాసవి క్లబ్ జిల్లా ఫస్ట్ లేడీ స్రవంతి, రిజియన్ చైర్మన్ శ్రీకర్ నాగ సావిత్రి, రీజన్ సెక్రెటరీ నీలకంఠ్, క్యాబినెట్ ట్రెజరర్ నాగరాజు, జోన్ చైర్ పర్సన్ బెండ సత్యవతి, వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, కార్యదర్శి కొత్త ఆంజనేయులు, కోశాధికారి తలంపల్లి పవన్ కుమార్, మాజీ గవర్నర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూమి రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలి




**మునిపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** తనకు తెలియకుండా 13 గుంటల భూమిని అదనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అల్లాపూర్‌కు చెందిన రైతు అంకెనపల్లి మల్లయ్య ఆరోపించారు. సర్వే నంబర్ 45ఈ/2లో 2016లో అన్నదమ్ముల ఒప్పందం మేరకు 20 గుంటలు మాత్రమే లక్ష్మయ్యకు బదిలీ చేయాల్సి ఉండగా, తనకు తెలియకుండా 33 గుంటలు రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. 2021లో ఆ భూమి సర్పంచ్ నారాయణ యాదవ్ పేరుపై బదిలీ అయినట్లు పేర్కొన్నారు. అదనంగా రిజిస్టర్ చేసిన 13 గుంటల భూమిని తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించలేదన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

## తొగరుపల్లి పాఠశాలలో నమూనా పార్లమెంట్




**కొండాపూర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** తొగరుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సోమవారం నమూనా పార్లమెంట్ నిర్వహించారు. ప్రజాస్వామ్యం, ప్రభుత్వ పరిపాలన, శాసనసభ విధానాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమం చేపట్టారు. స్పీకర్‌గా యూసుఫ్ బాబా వ్యవహరించగా, ప్రధానమంత్రిగా నైనికతో పాటు విద్య, ఆర్థిక, ఆరోగ్య, రవాణా, వ్యవసాయ, పర్యావరణ శాఖల మంత్రులుగా విద్యార్థులు వ్యవహరించారు. ప్రతిపక్ష సభ్యులు వివిధ అంశాలపై ప్రశ్నలు, చర్చలు చేపట్టారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత పౌరసత్వం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని హెచ్ఎం డాక్టర్ సి. దశరథ్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగంపేటలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ



**అమరచింత, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** సోమవారం మండల పరిధిలోని సింగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర నిర్వహించిన సమావేశంలో అధికారుల సమక్షంలో ఓటు మన హక్కు అర్హులైనటువంటి ప్రతి ఓటరు తమపేరు ఎస్ ఐ ఆర్ జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేసి అధికారులు అర్హత ఉన్న ప్రతి ఒక్కరు సరైన ధ్రువపత్రాలు అందించినట్లయితే ఓటర్ పేరు ఓటర్ లిస్టులో చేర్చడం జరుగుతుంది అని తెలిపారు ఓటర్ సమగ్ర సర్వే సమావేశంలో తాసిల్దార్ సిబ్బంది నాగేందర్ రవి కార్యదర్శి శివరాణి సర్పంచ్ సలోమి మన్యం ఉపసర్పంచ్ నారాయణ బిఎల్వి బిఎల్ఓ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 30న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

**ఉప్పునుంతల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఉప్పునుంతల పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం ఈనెల 30న ఉదయం 11.30 గంటలకు సంఘం ఆవరణలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మద్దు నరేందర్‌రెడ్డి, సీఈఓ కె.రవీందర్‌రావు తెలిపారు.
అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు. 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 29 వరకు జమా ఖర్చుల ఆమోదం, అక్టోబర్ 1 నుంచి మార్చి 31 వరకు అర్ధ సంవత్సర బడ్జెట్ అంచనా ఆమోదంతోపాటు ఇతర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

## ముస్లాపూర్ పాఠశాలలో మాక్ పార్లమెంట్



**అల్లాదుర్గం, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ముస్లాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. రాష్ట్రపతి, స్పీకర్, ప్రధాని, మంత్రులు, ప్రతిపక్ష నాయకులుగా విద్యార్థులు పాత్రలు పోషించారు. ప్రశ్నోత్తరాల సమయం, విద్య, మహిళా సాధికారత, ప్రభుత్వ పథకాలు, స్కాలర్‌షిప్‌లు, పర్యావరణం, సామాజిక సమస్యలపై చర్చించారు. కార్యక్రమంతో పార్లమెంటరీ విధానం, రాజ్యాంగ విలువలు, నాయకత్వం, సంభాషణ నైపుణ్యాలపై అవగాహన కలుగుతుందని ఎంఈఓ కే.లక్ష్మణ్ తెలిపారు. హెచ్ఎం ఎస్. రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు జాతీయ ఎక్సలెన్స్ అవార్డు




**నంగునూరు, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** పాలమాకుల గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు న్యూఢిల్లీలో నిర్వహించిన 'నిసా ఎడ్యు ఎక్స్‌పో'లో 'గ్లోబల్ బెస్ట్ నేషనల్ ఎక్సలెన్స్ స్కూల్' అవార్డు లభించింది. సోమవారం ఎంఈఓ తగిరెడ్డి దేశిరెడ్డి అవార్డును పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.వర్గీస్, డైరెక్టర్ పబ్బోజు సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీరంగనాథ స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాల చోరీ



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** శ్రీరంగాపురం చారిత్రాత్మక శ్రీరంగనాథ స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలు చోరీకి గురైన ఘటన కలకలం రేపింది. సమాచారం అందుకున్న బీజేపీ, దేవాదాయ శాఖ బృందం ఆదివారం ఆలయాన్ని సందర్శించి పరిశీలించింది. అర్చకులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. పురాతన ఆలయంలో చోరీకి పాల్పడటం విచారకరమని, నిందితులపై పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. చోరీకి గురైన విగ్రహాలను త్వరగా గుర్తించి ఆలయానికి అప్పగించాలని కోరారు.

## పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమ్మేళనం



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వనపట్ల గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. 40-50 ఏళ్ల క్రితం పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడేందుకు తమ పాఠశాల విద్యే పునాది అని గుర్తుచేసుకున్నారు. పాత స్నేహితులు, ఉపాధ్యాయులను కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. భవిష్యత్ కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, గౌస్, కవి వనపట్ల సుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ మన్నెపు రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు.. భూభారతిపై సమీక్ష

### వనపర్తి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి తదితర ముఖ్య అంశాలపై నాగర్ కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల అమలు, భూభారతి కార్యక్రమం పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులుపాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్



- సిద్దిపేటలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**చేర్యాల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఓట్ల చోరీ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఈసీ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ప్రజావాణికి ఆరు దరఖాస్తులు



**రామాయంపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** రామాయంపేట మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో షాజలోద్దీన్ తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు ఒకటి, ఇందిరమ్మ ఇళ్లకు రెండు, పోలీస్ శాఖకు ఒకటి, ఆర్టీసీకి ఒకటి, రైల్వే అండర్‌పాస్ మార్గానికి సంబంధించి ఒక దరఖాస్తు ఉన్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అమెరికాలో మంత్రి కోమటిరెడ్డిని కలిసిన రాజేందర్ రెడ్డి



**బాలానగర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బాలానగర్‌కు చెందిన స్వర్గీయ లక్ష్మారెడ్డి కుమారుడు రాజేందర్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాలానగర్ ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. స్వర్గీయ లక్ష్మారెడ్డి పార్టీకి అందించిన సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని తెలిపారు. భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగింది. రాజేందర్ రెడ్డి మంత్రిని కలిసి స్థానిక సమస్యలపై చర్చించడం పట్ల బాలానగర్ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## భగత్‌సింగ్ ఆశయాలే విద్యార్థి ఉద్యమాలకు స్ఫూర్తి



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** లా స్టూడెంట్ ఫోరం-పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి నివాళులర్పించి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. విద్యార్థులు ఆయన జీవితాన్ని, ఆశయాలను అధ్యయనం చేసి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్య, ఉపాధి, సామాజిక సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు, ఏఐఎస్ఎఫ్, స్వేరోస్, జేపీసీ ప్రతినిధులు, లా, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిబంధనలు సవరించాలి



**అమరచింత, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎస్. అజయ్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇందిరమ్మ రచ్చబండ ఇళ్ల లబ్ధిదారులను ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా ప్రకటించడం సరికాదన్నారు. నిబంధనలు సవరించి అర్హులను ఎల్3 నుంచి ఎల్2లోకి మార్చాలని కోరారు. గతంలో పైరవీల కారణంగా పలువురికి బిల్లులు సక్రమంగా అందక ఇళ్లు నిర్మించు కోలేకపోయారని తెలిపారు. ఉపాధి హామీ కింద 90 రోజుల కూలి రూ.28 వేల సాయాన్ని పట్టణ ప్రాంతాలకూ వర్తింప జేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రకటించిన రూ.6 లక్షల సాయాన్ని పూర్తిగా అందించాలని, బేస్‌మెంట్ నిర్మించిన వారు, గుడిసెలు, పెంకుటిళ్లు, మట్టి మిద్దెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బుచ్చన్న, సుజ్ఞానం, కురుమన్న, సతీష్, బాలయ్య, మోష తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

**నిబంధనలు పాటించాలని సూచన**





**తెలకపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** తెలకపల్లి మండలంలో ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు పూర్ణచందర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పి.నర్మదతో కలిసి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను పరిశీలించారు. మణికంఠ ట్రేడర్స్, షిరిడీ సాయి ఫర్టిలైజర్స్, అగ్రో సేవా కేంద్రం, శతాక్షి ట్రేడర్స్, అగ్రో రైతు సేవా కేంద్రం ట-2 తదితర ఎరువుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లోని స్టాక్ వివరాలు, స్టాక్ బోర్డు, లైసెన్స్ డిస్ప్లే, గోదాం షట్టర్ డోర్ నంబర్ తదితర అంశాలను పరిశీలించారు. స్టాక్ బోర్డు, లైసెన్స్ డిస్ప్లే ఏర్పాటు చేయని వారు, గోదాం షట్టర్‌కు డోర్ నంబర్ లేని వారికి అధికారులు హెచ్చరికలు జారీ చేసి, నిబంధనల ప్రకారం వెంటనే వాటిని సరిచేసుకోవాలని సూచించారు. రైతులకు ఎరువుల విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.

# సర్పంచ్ భర్తపై ప్రజావాణిలో ఫిర్యాదు



**అడ్డాకుల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఎరుకల సుబ్రహ్మణ్యం తన ఇంటి కాంపౌండ్ వాల్ కూల్చుతామని బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ భర్త నీలయ్య, రేషన్ డీలర్ అశోక్ తదితరులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో చెట్లు నరికివేయడం, కులం పేరుతో దూషించడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరినందుకు వేధింపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ డీఎస్పీతో విచారణ చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎరుకల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలి




**మద్దకల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపల్ శ్రీలతారెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'నషాముక్త యువ--వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.
మాదకద్రవ్యాలు యువత ఆరోగ్యం, కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ప్రిన్సిపల్ తెలిపారు. వాటి విక్రయాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీస్, వైద్య సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధం

- **అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలి**



**వనపర్తి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.
ఎన్నికల నిబంధనలు-1960లోని నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా తయారీ, ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ, పరిష్కారం తదితర ప్రక్రియలు షెడ్యూల్ ప్రకారం కొనసాగనున్నాయి.

**ముఖ్యమైన తేదీలు:**

- సెప్టెంబర్ 28న ప్రజా నోటీసు జారీ
- అక్టోబర్ 15న మొదటి పునఃప్రచురణ
- అక్టోబర్ 25న రెండో పునఃప్రచురణ
- నవంబర్ 6న ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ
- నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

అర్హులైన పట్టభద్రులు తమ దరఖాస్తులను సంబంధిత ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్‌ఓ), సహాయ ఓటర్ల నమోదు అధికారి (ఏఈఆర్‌ఓ) వద్ద సమర్పించవచ్చని తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

# నషాముక్త్ భారత్‌పై అవగాహన



**మల్దకల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించారు. పొగాకు, మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో నషాముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం యు.రాజేశ్వర్‌రెడ్డి, ఏఎన్‌ఎం పుష్ప, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ పోరాటం



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ చౌక్‌లో కళ్లకు నల్లగంతలు కట్టుకుని ఎర్రజెండాలతో నిరసన తెలిపారు.
ఎన్నికల కమిషన్ ఏకపక్ష నిర్ణయాలను పునఃసమీక్షించాలని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయం



**కొత్తపల్లి సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** అల్లీపూర్ గ్రామానికి చెందిన ఆర్. అచ్యుత్ రెడ్డి తండ్రి దామోదర్ రెడ్డికి రూ.75,000, అనంతప్ప తండ్రి కిష్టప్ప కి రూ.36,000 చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి కొత్తమల్లే భారతమ్మ తిమ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తమల్లే రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ చాటాలి



**గుమ్మడిదల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** మండలంలోని ఎస్‌వీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ సి.హెచ్. కుమార్ గౌడ్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రతిభ చాటి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు జరిగే పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొంటున్నారు. ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రేష్మ కుటుంబానికి ఆర్థిక సాయం



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామానికి చెందిన రేష్మ (21) కిడ్నీ వ్యాధితో ఈ నెల 18న మృతి చెందింది. స్పందించిన సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులు జిల్లా కేంద్రంలోని శృతి వనంలో రేష్మ తల్లి చాంద్‌బీకి రూ.36 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తమవంతు సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏ.రాముడు, వెంకటరాముడు, మురళి, సంజీవ్, వినోద్, అశోక్ పాల్గొన్నారు.

# శ్రీరంగాపూర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ కార్యక్రమం



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** మత్తు పదార్థాల నివారణపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినదించారు. ప్రిన్సిపాల్ ఈ.జె. మోజెస్ ఆధ్వర్యంలో అవగాహన వీడియోలు, పాటలు ప్రదర్శించారు.
మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, లక్ష్యాలను ఏర్పరచుకుని చదువులో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన 2బి బార్‌కు దరఖాస్తు ఆహ్వానం

**మక్తల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** తెలంగాణ ఎక్సైజ్ నిబంధనల ప్రకారం మక్తల్ మున్సిపాలిటీలలో 2బి బార్ ఏర్పాటుకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు చేసుకోవాలని నారాయణపేట జిల్లా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సైదులు తెలిపారు. (నాన్-రిఫండబుల్) దరఖాస్తు రుసుము: రూ. 1,10,000/- DPEO - Mahabubnagar పేరున చలాన్ లేదా డి.డి. రూపంలో చెల్లించాలని తెలిపారు. అక్టోబర్ 12 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8712658 872 సంప్రదించాలని సూచించారు.

## 10 షట్టర్లకు రీ-టెండర్ నిర్వహించాలి




**నంగునూరు, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని 10 షట్టర్లకు పారదర్శకంగా రీ-టెండర్ నిర్వహించి, అర్హులైన స్థానిక వ్యాపారులకు అవకాశం కల్పించాలని దేవులపల్లి నవీన్ కోరారు. సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. షట్టర్లు దళారుల కనుసన్నల్లో ఉండటంతో అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ రీ-టెండర్ నిర్వహిస్తే అర్హులకు న్యాయం జరగడంతో పాటు మార్కెట్ కమిటీకి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. షట్టర్ల కేటాయింపుపై పూర్తిస్థాయి విచారణ జరిపి పారదర్శక చర్యలు తీసుకోవాలని కోరారు.

## వైద్య విద్యార్థిని ఝాన్సీకి సాదే రాజు ఆర్థిక చేయూత




**ఉప్పునుంతల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** పేదరికాన్ని అధిగమించి నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన అచ్చంపేటకు చెందిన ఝాన్సీకి సాదే రాజు అండగా నిలిచారు. మొదటి ఏడాది వైద్య విద్య ఖర్చుల కోసం రూ.లక్ష సాయం అందించి, ఐదేళ్ల విద్య పూర్తయ్యే వరకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఝాన్సీని విద్యాపరంగా దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కూలి పనులు, మేకల పెంపకంతో కుటుంబానికి చేదోడుగా ఉంటూనే చదువుకున్న ఝాన్సీ ఇంటర్‌లో 975 మార్కులు సాధించి, నీట్‌లో ఉత్తీర్ణతతో వైద్య సీటు పొందింది. ప్రతిభావంతులైన విద్యార్థులకు సమాజం అండగా నిలవాలని సాదే రాజు కోరారు. ఝాన్సీ తండ్రి మల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## భగత్‌సింగ్ ఒక వ్యక్తి కాదు.. శక్తి



**నారాయణపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** భగత్‌సింగ్ ఒక వ్యక్తి కాదు.. శక్తి అని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. ఏబీవీపీ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ నేటికీ యువతకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. దేశభక్తి, దేశ అభివృద్ధి కోసం ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంతియాజ్, కళాశాల విద్యార్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మర్కుక్ పోలీస్ స్టేషన్‌లో సీపీ వార్షిక తనిఖీ

- **ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: సీపీ రష్మి పెరుమాళ్**




**మర్కుక్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ సోమవారం మర్కుక్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఎస్ఐ యూనుస్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది సీపీకి రిపోర్ట్ చేయగా, పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బంది కిట్ ఆర్టికల్స్, కేసులకు సంబంధించిన వాహనాలు, స్టేషన్ పరిసరాలు, రికార్డులు, వివిధ వర్టికల్స్ పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ...** పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజల సమస్యలను ఓపికగా విని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీటీవీ నిఘాను పెంచాలని ఎస్ఐని ఆదేశించారు. యువతకు 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర' కార్యక్రమంపై అవగాహన కల్పించి, సరైన దిశానిర్దేశం చేయాలని సూచించారు.

విధుల్లో బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందికి సూచించిన సీపీ.. "నివారణే మేలైన మార్గం" అనే సూత్రాన్ని గుర్తు చేశారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి వర్టికల్ ఇన్‌చార్జ్ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, రూరల్ సీఐ రవి రాజు, ఎస్ఐ యూనుస్ అహ్మద్ అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద శంకరంపేటలో భగత్ సింగ్ జయంతి వేడుకలు



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలో భగత్ సింగ్ జయంతి వేడుకలను సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి సిఐటియు నాయకులు గ్రామస్తులు పూలమాలలు వేశారు. భగత్ సింగ్ చేసిన సేవలు గురించి పలువురు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బాధ్యులు, పంచాయతీ కార్మికులు గ్రామస్తులు, పల్లెబోయిన రాములు, సంగమేశ్వర్. సిహెచ్ రాములు, రవి, ప్రవీణ్ దత్తు, తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ కలల భారతం-ఓటుహక్కు పరిరక్షణే యువత బాధ్యత



**కోహెడ, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కోహెడలో ర్యాలీ నిర్వహించారు. సమానత్వం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య న్యాయం కోసం యువత పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణలో తప్పిదాలపై సమగ్ర విచారణ జరపాలని, అర్హుల ఓట్లు తొలగకుండా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలి



**గద్వాల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** అకాల వర్షాలతో నష్టపోతున్న పత్తి రైతులను ఆదుకునేందుకు మరో నాలుగు నెలలు కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. తుఫానుకు ముందు క్వింటా రూ.10,500 ఉన్న పత్తి ధర ప్రస్తుతం రూ.8,200కు పడిపోయిందన్నారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మల్దకల్, గట్టు, మానవపాడు మండలాల్లో భారీగా పత్తి సాగవుతోందన్నారు.

## జడ్చర్ల మున్సిపాలిటీలో మెప్మా అధికారుల తనిఖీ



**జడ్చర్ల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** మెప్మా అదనపు మిషన్ డైరెక్టర్ ఎన్. యాదగిరి రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ యూసుఫ్ సోమవారం జడ్చర్ల మున్సిపాలిటీని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ వారికి స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తున్న యూనిఫాంల నాణ్యతను, పంపిణీ ప్రక్రియను అధికారులు పరిశీలించారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టౌన్ మిషన్ కోఆర్డినేటర్ నిర్మల, పట్టణ సమాఖ్య ఆర్.పి శ్వేత, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## సీఈసీ, ప్రధాని మోదీ దిష్టిబొమ్మల దహనం



**గద్వాల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** గద్వాలలో డీసీసీ అధ్యక్షుడు పటేల్ రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరసన చేపట్టారు. సీఈసీ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చిత్రాలతో పోస్టర్లు ప్రదర్శించి, దిష్టిబొమ్మలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓట్ల తొలగింపులో అక్రమాలు జరుగుతున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని నాయకులు తెలిపారు.

## అట్టహాసంగా ప్రారంభమైన జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు



**నారాయణపేట సెప్టెంబర్ 28(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా ఎస్జీఎఫ్ అండర్ 14 అండర్ 17 బాల బాలికల జిల్లా స్థాయి క్రీడా పోటీలు సోమవారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో అట్టహాసంగా ప్రారంభమ య్యాయి.తేదీ 28, 29, 30, వాలీబాల్ కోకో కబడ్డీ పోటీలకు క్రీడలు జరగబో తున్నాయి. ఈ క్రీడలలో భాగంగా సోమవారం అండర్ 14 అండర్ 17 బాల బాలికల వాలీబాల్ క్రీడాలు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు, మున్సిపల్ చైర్మన్ శ్వేత సత్య యాదవ్, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,డివైఎస్ఓ ఇన్చార్జ్ వెంకటేష్ శెట్టి కౌన్సిలర్లు రవికుమార్ యాదవ్ రాజేష్ ఘూట్ విద్యాశాఖ కార్యాలయ సూపర్డెంట్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పిడీలు నర్సింహులు రత్నయ్య వెంకటప్ప బాలరాజ్ సాయినాథ్ అనంత సేన మౌలాలి రామకృష్ణారెడ్డి రాజేశ్వరి స్వప్న పరంజ్యోతి పర్వీన్ బేగం రాజశేఖర్ శ్రీధర్ వేణుగోపాల్ భీరప్ప బసంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగాపురం ఆలయ భద్రతపై భక్తుల ఆందోళన

• నిందితుల కోసం పోలీసుల గాలింపు

**పెబ్బేరు, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన శ్రీరంగాపురం రంగనాయకస్వామి ఆలయంలో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి. తరచూ జరుగుతున్న దొంగతనాలతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

గత 40 ఏళ్లుగా ఈ ఆలయంలో పలుమార్లు చోరీలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా సీతారామాలయంలోని పంచలోహ విగ్రహాలు చోరీ కావడం భక్తులను ఆవేదనకు గురి చేసింది.

**పోలీసుల దర్యాప్తు ముమ్మరం...**

చోరీ ఘటనపై కేసు నమోదు చేసుకున్న శ్రీరంగాపూర్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునీతారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఆలయ పరిసరాలను పరిశీలించి, అనుమానితులను విచారిస్తోంది.

పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టినట్లు పోలీసులు తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని భరోసా ఇచ్చారు.

**భద్రత పెంచాలని డిమాండ్...**

కోట్ల విలువైన పంచలోహ విగ్రహాలు, అరుదైన తంజావూరు



చిత్రపటాలు ఉన్న ఈ ఆలయానికి శాశ్వత భద్రత కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

– రాత్రి పూట ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయాలి

– పనిచేయని సీసీ కెమెరాల స్థానంలో నూతన కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– ఆలయానికి బలమైన తాళాలు, గ్రిల్స్ ఏర్పాటు చేయాలి

దేవాదాయ శాఖ అధికారులు, వనపర్తి రాజవంశీయులు చొరవ తీసుకుని ఆలయ భద్రతకు చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సీఈసీ రాజీనామాకు డిమాండ్..ధర్నాలో ఎమ్మెల్యే కసిరెడ్డి

• నాగర్‌కర్నూలులో కాంగ్రెస్ నిరసనలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే

• లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**కల్వకుర్తి,సెప్టెంబర్ 28(జనంసాక్షి):**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు మద్దతు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ,ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత,ప్రజల ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటానికి నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితో పాటు వెల్దండ,కల్వకుర్తి,చారకొండ ప్రాంతాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

**లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు...**

ధర్నాలో పాల్గొన్న అనంతరం కసిరెడ్డి నారాయణరెడ్డి తన నివాసంలో





వివిధ మండలాలకు చెందినలబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో అందించారు.దీంతో నిరసన కార్యక్రమంతో పాటు లబ్ధిదారులకు సహాయ నిధి చెక్కుల పంపిణీలోనూ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# అప్పు తీర్చినా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయలేదని ఫిర్యాదు

**బాలానగర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కేతిరెడ్డిపల్లికి చెందిన రైతు కొత్తకాపు నర్సింహారెడ్డి వడ్డీ వ్యాపారి వేధింపులపై బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ అవసరాల కోసం నాలుగేళ్ల క్రితం చన్నాడ రాఘవేందర్ వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని, చెక్కులు, ప్రామిసరీ నోట్లు, 100 గజాల ప్లాట్ దస్తావేజు భద్రతగా ఇచ్చినట్లు తెలిపారు. రూ.3 లక్షలు చెల్లించినా పత్రాలు తిరిగి ఇవ్వలేదన్నారు. ఈ ఏడాది జూలైలో మరోసారి రూ.8 లక్షలు అప్పుగా తీసుకుని ప్లాట్‌ను సేల్‌డీడ్ చేయించి, ఏడాదిలోపు అసలు, వడ్డీ చెల్లిస్తే తిరిగి రిజిస్ట్రేషన్ చేస్తానని ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 11న డబ్బు చెల్లించేందుకు సిద్ధమని చెప్పినా రిజిస్ట్రేషన్‌కు నిరాకరించి దూషించి, బెదిరించారని ఆరోపించారు. చెక్కులు, ప్రామిసరీ నోట్లను దుర్వినియోగం చేసి డబ్బులు వసూలు చేయాలని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు, కుటుంబానికి రక్షణ కల్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## అంతారం భూముల రీ-సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

**కౌడిపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** అంతారం



గ్రామ భూముల రీ-సర్వేను త్వరితగతిన పూర్తి చేసి తదుపరి కార్యాచరణ చేపట్టాలని మెదక్ జిల్లా సర్వే అధికారి కిషన్ అధికారులను ఆదేశించారు. కౌడిపల్లిలో కౌడిపల్లి, చిలిపిచెడ్ తహసీల్దార్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి ఇప్పటివరకు జరిగిన పనులపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రీ-సర్వేలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు కృష్ణ, శివప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

## అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పాటు చేయాలి



**చేర్యాల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** చేర్యాల కోర్టు పరిధిలో ప్రస్తుతం 2549 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్ లో ఉన్నాయి, ఈ కేసుల దృశ్య అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఎంతో అవసరం ఉందని సోమవారం చేర్యాల బార్ అసోసియేషన్ బృందము సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి గన్నారపు సుదర్శన్ కి దృష్టికి తీసుకువెళ్లడంతో జిల్లా జడ్జ్ సానుకూలంగా స్పందించి న్యాయవాదులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చేర్యాల బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి మాజీ మంత్రి సన్మానం

• పేదలకు సేవ చేసే వైద్యురాలిగా ఎదగాలి: సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):**



వనపర్తి పట్టణం 5వ వార్డుకు చెందిన ముదావత్ భావన కొడంగల్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆమెను అభినందించి సన్మానించారు. తన స్వగృహంలో భావనను ఘనంగా సత్కరించిన నిరంజన్‌రెడ్డి, ఆమె తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... వైద్య విద్యలో సీటు సాధించడం భావన కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. విద్యను అంకితభావంతో అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా రాణిస్తూ పేద, సామాన్య ప్రజలకు సేవలందించాలని సూచించారు. భావన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# శ్రీరంగాపూర్‌కు రూ.2.25 కోట్లతో తహసీల్దార్ కార్యాలయం

**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం మంజూరైంది. రెవెన్యూ (DA-CMRF) శాఖ జీఓఆర్‌టీ నం.597, తేదీ 26-09-2026 ద్వారా భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.25 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక వసతులతో నిర్మించనున్న ఈ భవనంతో మండల ప్రజలకు





రెవెన్యూ సేవలు మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి రానున్నాయి. భవనం మంజూరుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చొరవ చూపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ డా. మల్లు రవికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యాలయం మంజూరు పట్ల శ్రీరంగాపూర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నా

# భూసమస్యల పరిష్కారానికి రీసర్వే ఏకైక మార్గం

రెండో విడతలో అవకాశం రాని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 9న సమరభేరి సభను విజయవంతం చేయండి

**నవాబుపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):**



హైదరాబాద్‌లో అక్టోబర్ 9న నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ నవాబుపేటలో బీఎస్పీ నాయకులు గోడపత్రికలు విడుదల చేశారు. మండల అధ్యక్షుడు సూర్యనాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్ ముదిరాజ్, ఇన్‌చార్జి పండరీనాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాన్షీరామ్ 20వ వర్ధంతిని పురస్కరించుకుని సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహుజనులు, దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పాతపల్లిలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు

**ధన్వాడ, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):**



ధన్వాడ మండలం పాతపల్లి గ్రామంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నారాయణపేట జిల్లా కార్యదర్శి మహేష్, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి తిరుమలేష్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సర్పంచ్ కే. బీరప్ప, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రైతు కూలీ సంఘం నాయకులు వై. రాజు, పీడీఎస్‌యూ, పీవైఎల్, రైతు కూలీ సంఘం గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం భగత్‌సింగ్ చేసిన పోరాటం, త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్య, విజ్ఞానం, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత కృషి చేయాలని వారు కోరారు.

## గాంధీ విగ్రహ ప్రతిష్టపై నిర్లక్ష్యం



• ఎమ్.బి. బాలకృష్ణ కలెక్టర్‌కు వినతి

**జడ్చర్ల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** జడ్చర్ల 12వ వార్డులోని ఖాళీ స్థలంలో గాంధీ విగ్రహ ప్రతిష్టాపన, పార్కు అభివృద్ధి విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు ఎమ్.బి. బాలకృష్ణ మండిపడ్డారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితమే తెచ్చిన గాంధీ విగ్రహాన్ని అధికారులు ఇంకా ప్రతిష్టించక పోవడం శోచనీయమని, స్థానిక ఎమ్మెల్యే కలెక్టర్‌కు లేఖ రాసినా పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి విగ్రహాన్ని ప్రతిష్టించి, జాతీయ జెండా ఆవిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్, తక్షణమే ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు బాలకృష్ణ తెలిపారు.

## పదోన్నతులు పొందిన పోలీసులకు ఎస్పీ అభినందనలు



• ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలి
• విధుల్లో అంకితభావంతో పనిచేయాలి
• ఎస్పీ డి. సునీత రెడ్డి

**వనపర్తి సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసు సిబ్బందికి పదోన్నతులు లభించాయి. ఏఎస్ఐగా పనిచేస్తున్న వెంకట నాగరాజు ఎస్సైగా, హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న రాజేందర్ రెడ్డి, బాలీశ్వర్ రెడ్డిలు ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, వారి చేతుల మీదుగా పదోన్నతి ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సిబ్బందికి ఆమె అభినందనలు తెలిపారు. పదోన్నతితో ఆనందంతో పాటు బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. అంకితభావంతో విధులు నిర్వహించి వనపర్తి జిల్లా పోలీస్ శాఖకు, తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కంకర పరిచారు - తారు మరిచారు



• వాహనదారులకు తరచూ గాయాలు.. స్పందించని అధికారులు

**వెల్దండ, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వెల్దండ మండలంలోని బైరా పూర్ నుండి కుందారం తండా కలకొండ గ్రామం వరకు 2023 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే గుర్క జయపాల్ యాదవ్ ఆధ్వర్యంలో బీటీ రోడ్ మంజూరు కావడం జరిగింది. రోడ్డు నేటికి పూర్తి కావడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సగం రోడ్డు కంకర వేసి కాంట్రాక్టర్లు నిలిపివేయడం జరిగిందని,నిత్యం ఈ రహదారి ఉన్న వందలాదిమంది వాహనదారులు విద్యార్థులు, వృద్ధులు ప్రయాణిస్తూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో కంకరపై మట్టిపరిచి మట్టిరోడుగా మారుస్తామని హెచ్చరించారు.

## యాదగిరి గౌడ్‌ను పరామర్శించిన బక్కని నర్సిములు



**బాలానగర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** బాలానగర్ మాజీ ఎంపీపీ యాదగిరి గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సిములు సోమవారం పరామర్శించారు. ఆయన స్వగృహానికి వెళ్లిన నర్సిములు ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇరువురు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన సమయంలో బాలానగర్ అభివృద్ధి, ప్రజా సమస్యలకు సంబంధించిన విషయాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. యాదగిరి గౌడ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని నర్సిములు ఆకాంక్షించారు. పరామర్శకు వచ్చిన నర్సిములుకు యాదగిరి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## యువకుడు అదృశ్యం




**నిజాంపేట్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** నాగ్ధర్ గ్రామానికి చెందిన కంది సుధాకర్ (23) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సుధాకర్ వృత్తిరీత్యా ప్లంబర్‌గా హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో పనిచేస్తున్నాడు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఈ నెల 18న స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 27న ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సుధాకర్ తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సుధాకర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు.

## జిల్లాలో ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు: జిల్లా ఎస్పీ



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ప్రజల సహకారంతో పోలీసుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, తాజ్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసినందు న జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ప్రజలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులకు పీస్ కమిటీ మత పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవా లు, శోభాయాత్రలు,నిమజ్జన కార్యక్రమాలతో పాటు తాజ్ బాబా దర్గా ఉర్సు వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హర్షం వ్యక్తం చేశారు.ప్రజల సహకారం, ఉత్సవ కమిటీల బాధ్యతా యుత వ్యవహారం, మత పెద్దలు, హిందూ-ముస్లిం పీస్ కమిటీల సమన్వయం, పోలీస్ శాఖ పటిష్ట మైన బందోబస్తు చర్యలతో, అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించామని ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు, పీస్ కమిటీ సభ్య లు, యువత, జిల్లా ప్రజల కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గణేష్ శోభాయా త్ర నిమజ్జనం, తాజ్ బాబా దర్గా ఉర్సు నిర్వాహకులు, భక్తులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించడం అభినందనీయమన్నారు. జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన పోలీ సు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమె రాలు, వీడియో రికార్డింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ భద్రత వంటి చర్యలతో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు.ప్రజల ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభా వం నారాయణపేట జిల్లా శాంతి సామరస్యాలకు ప్రతీకగా నిలిచాయని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, పోలీసు అధికా రులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, జిల్లా ప్రజలందరికీ ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .

## పెద్ద శంకరంపేట ఎంపీడీవో గా షాకిర్ అలీ బాధ్యతల స్వీకరణ



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట మండల ఎంపీడీవోగా షాకిర్ అలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవో గా విధులు నిర్వహించిన క్రాంతి కుమార్ హైదరాబాదులో ట్రైనింగ్ నిమిత్తం వెళ్లారు. దీంతో సూపర్ ఇండెంట్ గా విధులు నిర్వహిస్తున్న షాకీర్ అలీ ఎంపీడీవో గా పూర్తి బాధ్యతలు చేపట్టారు.

## సంస్కార్ విద్యాలయంలో వృక్ష రక్షాబంధన్



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ప్రకృతి వందన్ సంకల్ప దివస్ నందర్భంగా సంస్కార్ విద్యాలయంలో విద్యార్థులు వృక్ష రక్షాబంధన్ నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో వృక్షాలకు పూజలు చేసి కంకణాలు కట్టారు. మొక్కలు నాటి సంరక్షించాలని, నీటిని పొదుపుగా వాడాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచించారు. ఎస్‌జీఈ ఆధ్వర్యంలో ప్రకృతి సంకల్ప దివస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు శూన్యం..

# పోలీస్ శాఖ డుమ్మా .!?




**పాపన్నపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా స్థాయి నుండి మండల స్థాయిలో నిర్వహించడానికి రేవంత్ సర్కార్ ఇటీవల నిర్ణయం తీసుకుంది. సోమవారం పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో దరఖాస్తులు రాలేదు. పలు శాఖల అధికారులు సైతం ఇష్టానుసారంగా వివిధ సమయాల్లో హాజరయ్యారు. మొదటి వారం పోలీస్ శాఖ ఈ జాబితాలో లేదు. తదనంతరం పోలీస్ శాఖ అధికారులు సైతం హాజరు కావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా గత కొన్ని వారాలుగా పాపన్నపేట పోలీస్ శాఖ నుండి అధికారులు

## పాఠశాలలో మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన



**కోహీర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** దిగ్వాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ నవీన్, డాక్టర్ ఉదయ్ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఎంఈఓ మహమ్మద్ జాకిర్ హుస్సేన్ సూచించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

## ఇర్ఫాని దర్గా ఉర్సు ఉత్సవాలకు ముస్తాబు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** సంగారెడ్డి శివారులోని ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు అక్టోబర్ 1, 2 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠాధిపతి ఉమర్ బీన్ అహ్మద్ తెలిపారు. 1న గంధం ఊరేగింపు, అఖిల భారత కవి సమ్మేళనం, 2న దీపారాధన, ఖవ్వాలి, అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు వెల్లడించారు.

# 420 హామీలను వెంటనే అమలు చేయాలి




**చేర్యాల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట, సిరిసిల్ల పర్యటనల సందర్భంగా రాజకీయ విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలుపై సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకుడు శివగారి అంజయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఆయా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు రైతులు, మహిళలు, యువత, నేతన్నల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తే సహించబోమని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చింతల పర్శ రాములు, పచ్చిమడ్ల సిద్ధిరాములు, రాచకొండ శ్రీనివాస్, కూరపాటి మధుసూదన్, పాక బాలయ్య, పచ్చిమడ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.